ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

- మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి

కొల్లాపూర్, జూన్ 11 : నియోజకవర్గంలో వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రుస్తున్న నేపథ్యం లో మట్టి మిద్దెల్లో నివసించే వారు జాగ్రత్తగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులు, పశువుల కాపరులు పిడుగు పాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నల్లమల సమీప గ్రామాలు మొలచింతలపల్లి, అమరగిరి, ఎర్రగట్టుబొల్లారం, ముక్కిడిగుండం, సోమశిల తదితర గ్రామాలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వానకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. మట్టి మిద్దెల్లో నివాసం ఉండే వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ కార్యకర్తలు అవసరం అయినా చోట సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీకి వినతి

ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 11 : పట్టణంలోని 17వ వార్డులో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రం లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు మాట్లాడుతూ కాలనీగా ఏర్పడినప్పటినుంచి ఇప్పటివరకు రోడ్డు సౌకర్యం లేదని, కనీసం మట్టిరోడ్డు అయినా వేయాలని కోరారు. అదేవిధంగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజి కాల్వలు చేప ట్టి మధ్యలోనే ఆపి వేశారని, మిషన్ భగీరథ పైపులువేసి మధ్యలోనే నిలిపివేశారన్నారు. ఇంటినెంబర్లు కూ డా లేవని ప్రభుత్వం నుంచి ఎలాంటి సంక్షేమ పథకాలు రావడం లేదని వెంటనే సమస్యలన్నీ పరిష్కరించాలని ఎమ్మెల్సీని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాసులు, జిల్లా నాయకులు గీత, రవి ఉన్నారు.

పెండింగ్ డబ్బులు చెల్లించాలి

ఏపీవోకు వినతి పత్రాన్ని అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

పెంట్లవెల్లి, జూన్ 11 : మండలంలోని 10గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకంలో పనిచేసిన కూలీలకు 6వారాల నుంచి కూలీ డబ్బులు ఇవ్వడంలేదని, తక్షణమే ఉపాధి కూలీల పెండింగ్ డబ్బులు చెల్లించాలని కోరుతూ మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీవోకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల నాయకులు గోపాల్, సీఐటీయూ నాగర్‌కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు హన్మంతు మాట్లాడుతూ 6వారాల నుంచి ఉపాధి కూలీలకు డబ్బులు చెల్లించలేనిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. ఉపాధి కూలీలకు రోజు వారి కూలీ రూ.600ఇవ్వాలని, పని దినాలు 200 రోజులకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాసులు, రాజు, లక్ష్మయ్య, బాలస్వామి, నవీన్ తదితరులు ఉన్నారు.

వేళకు కార్యాలయాలకు రావాలి

తాసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో

- ఆర్డీవో సురేశ్

తాడూరు, జూన్ 11 : కార్యాలయాలకు వేళకు ఉద్యోగులు క్రమం తప్పకుండా హాజరుకావాలని ఆర్డీవో సురేశ్ అన్నారు. మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు విధులకు క్రమం తప్పకుండా రావాలని సూచించారు. విద్యార్థులు ఆదాయం, కులం సర్టిఫికెట్ల కోసం కార్యాలయం చుట్టూ తిరగకుండా వారికి ఎప్పటికప్పుడు అందజేయాలన్నారు. రైతులు వ్యవసాయ రుణాల కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారికి కావాల్సిన ధృవపత్రాలను ఇవ్వాలన్నారు. కొన్నిరోజుల నుంచి ఎన్నికల నిర్వహణలో అధికారులు పాల్గొన్నారని, ఎన్నికలు ముగియడంతో కాబట్టి యథావిధిగా తమ విధులకు సక్రమంగా హాజరై తమ విధులు నిర్వహించుకోవాలని సూచించారు. ఎక్కడైనా పొరపాట్లు జరిగినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తాసీల్దార్ ప్రమీళ తదితర సిబ్బంది ఉన్నారు.

ఉపాధిహామీ నిర్వీర్యానికి కుట్ర

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి

చారకొండ, జూన్ 11 : జాతీయ ఉపాధిహామీ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి అన్నారు. జూన్ 10న హైదరాబాద్‌లో ఉపాధిహామీ పథకం పరిరక్షణ కోసం నిర్వహించే రాష్ట్ర సదస్సుకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామా ల్లో వలసలను నిర్మూలించేందుకు తీసుకొచ్చిన ఉపాధిహామీ పథకాన్ని కేంద్ర ప్రభు త్వ రద్దు చేయాలని చూస్తున్నదన్నారు. పథకం రద్దుచేస్తే ఎంతోమంది నిరుపేదలు ఉపాధి లేకుండా మళ్లీ వలసలు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. కూలీలకు పని దినాలు 200 రోజులకు పెంచాలని, అదేవిధంగా రోజుకు రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్లు సాధనకు, ఉపాధిహామీ పరిరక్షణకు నిర్వహిస్తున్న రాష్ట్రసదస్సుకు కూలీలు పెద్దఎత్తున హాజరు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, రాములు, అంజయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

లింగాల, జూన్ 11 : గ్రామీణ ప్రజలు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకొని ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్థిక అక్షరాస్యత కేంద్రం మండల కౌన్సిలర్ మన్సూర్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని శాయిన్‌పేటలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కూలీలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన బ్యాంకులపై ఉన్న అభద్రతాభావాన్ని తొలగించి, ఖాతా తెరుచుకునే సమయంలో బ్యాంకు అధికారులకు సమర్పించాల్సిన పత్రాల గురించి వివరించారు. పీఎం జీవన్ జ్యోతి యోజన ఇన్సూరెన్స్, పదేండ్లు పైబడిన బాలికలకు సుకన్య యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకంలో భాగస్వాములు కావాలన్నారు. సైబర్ క్రైంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు వివరాలు వంటివి అడిగితే చెప్పవద్దన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రూపేశ్, ఉపాధిహామీ కూలీలు అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దవాగుకు రాజకీయ గ్రహణం !

- ఏండ్ల తరబడి వంతెనకు నోచుకోని వైనం
- వర్షాకాలం గిరిజనులకు ఇక్కట్లు

నార్లాపూర్-ముక్కిడిగుండం మధ్య వర్షం వస్తే చాలు గండం ఏర్పడుతున్నది. రెండు గ్రామాల మధ్య పారుతున్న పెద్దవాగు దాటాలంటే పెద్ద సవాల్‌గా మారుతోంది. నిజాంకాలం నుంచి ఉన్న డిమాండ్ నేటికీ తీరలేదు. 19 ఏండ్ల నుంచి వివిధ హోదాల్లో పదువులు చేపట్టిన ఓ ప్రజాప్రతినిధి చివరకు పెద్దవాగుపై వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 2018లో ఓటమి చెందడంతో అతడి అనుచరుడు, కాంట్రాక్టర్ పనులను అటకెక్కించారు. దీంతో బీఆర్ఎస్ ప్రభుత్వం 2023లో ఈ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నమైన బ్రిడ్జి నిర్మించేందుకు నిర్ణయించింది. అవాంతరాలను దాటి వంతెన పనులు ప్రారంభమయ్యే నాటికి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో వంతెన నిర్మాణం కలగానే మిగిలింది. దీంతో ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో ఈసారీ గిరిజనుల రాకపోకలకు కష్టాలు తప్పేలా లేవు. ఇప్పటికైనా స్థానిక మంత్రి, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- కొల్లాపూర్, జూన్ 11

నార్లాపూర్-ముక్కిడిగుండం గ్రామాల మధ్య ఉధృతంగా పెద్దవాగు (ఫైల్)



వంతెన నిర్మాణం చేపట్టాలని నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజన సంఘం నాయకులు (ఫైల్)

వీడని రాజకీయ గ్రహణం

కొల్లాపూర్ మండల పరిధిలోని నల్లమల గ్రామాలకు కలిపే పెద్దవాగుపై కొల్లాపూర్ పరిసర ప్రాంతాల్లో తెలియని వారు ఉండరు. పెద్దవాగుకు వరద వచ్చిందంటే నల్లమల గ్రామాలకు కొల్లాపూర్‌కు పూర్తిగా సంబంధాలు తెగిపోతాయి. రెండేండ్ల కిందట వారంరోజుల పాటు ఎడతెరపి లేకుండా వర్షాలు కురువడంతో పెద్దవాగుకు భారీ వరద వచ్చింది. దీంతో ఉధృతి తగ్గేవరకు నల్లమల గ్రామాలైనా ముక్కిడిగుండం, గేమ్యానాయక్ తాండ, మొలచింతలపల్లి గ్రామాలు నీటి సుడిగుండం నుంచి బయటపడలేదు. అత్యవసర పరిస్థితుల్లోనైనా బయటకు రావాలంటే గ్రామాల చుట్టూ నీళ్లుచేరడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. అంతేకాదు మూడురోజుల పాటు అప్పటి ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి స్వయంగా పుట్టిలో ప్రయాణం చేసి గ్రామస్తులకు నిత్యవసర సరుకులను అందజేశారు. వర్షకాలం వచ్చిందంటే నల్లమల సమీప గ్రామాల ప్రజల్లో భయం నెలకొంది. తరాలు మారుతు న్నా పెద్దవాగుపై వంతెన నిర్మాణాన్ని పాలకులు ఎందుకు పూర్తిచేయడం లేదనే ప్రశ్న తలెత్తుతోంది. పెద్దవాగుపై వంతెన నిర్మాణం పూర్తి కావాలంటే రాజకీయ గ్రహ ణం వీడాలనే అభిప్రాయం గ్రామస్తుల్లో ఉంది.

నాబార్డు నుంచి..

నల్లమల గ్రామాల ప్రజల డిమాండ్ మేరకు 2014 సంవత్సరంలో పెద్దవాగుపై వంతెన నిర్మాణానికి నాబార్డు నుంచి రూ.5.10లక్షలు కేటాయించారు. ఓ ప్రజాప్రతినిధి అనుచరుడు టెండర్ల పనులను దక్కించుకున్నారు. అప్పటి నుంచి 2018 వరకు సర్వేల పేరుతో వంతెన నిర్మాణాన్ని కాలగర్భంలో గడిచిపోయింది. 2018 ఎన్నికల్లో కూ డా పెద్దవాగుపై వంతెన నిర్మాణం ప్రధాన డిమాండ్‌గా తెరపైకి వచ్చింది. బీరం హర్షవర్ధన్ రెడ్డి గెలవడం అనంతరం కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేరడంతో పెద్దవాగుకు మంచిరోజులు వచ్చాయని సమీప గ్రామాల ప్రజలు భావించారు. కానీ గుత్తేదారుడు కూడా రాజకీయ నాయకుడు కావడంతో పెద్దవాగుపై వంతెన నిర్మాణం ఓ ప్రజాప్రతినిధి ఓటమితో నే ఆగిపోయిందని చెప్పవచ్చు. అప్పటి ఎమ్మెల్యే బీరం ఒత్తిడితో పాత గుత్తేదారుడు వంతెన నిర్మాణం పనులను వెనక్కి తీసుకోవడంతో పెద్దవాగు సమస్య మొదటికి వచ్చింది. బీరం హర్షవర్ధన్‌రెడ్డి ప్రత్యేక కృషితో వంతెన నిర్మాణం ఆవశ్యకతను ప్రభుత్వానికి వివరించి ఎస్‌డీఎఫ్ (స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్) నుంచి నిర్మాణం జరిగే విధంగా చర్యలు చేపట్టారు. 2023 సంవత్సరం జూన్ మ ధ్య కాలంలో వంతెన నిర్మాణం కోసం ఎస్‌డీఎఫ్ నిధులు కేటాయించడంతో మళ్లీ అన్‌లైన్ టెండర్ నిర్వహించారు. ప నులు దక్కించుకున్న గుత్తేదారుడుపై బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఒత్తిడి పెంచడంతో పెద్దవాగుపై వంతెన నిర్మాణానికి అడ్డంకిగా మారిన ఎలక్ట్రికల్ లైన్, పైప్‌లైన్ సమస్యలను డిపార్ట్‌మెంట్ల మధ్య సమన్వయలోపం ఉన్న పరిష్కారం చే సుకోవడంతో పాటు పెద్దవాగుపై ఫౌండేషన్ పనులను ప్రా రంభించారు. అంతలోనే ఎన్నికలు రావడంతో మళ్లీ ప్ర భుత్వం మారడంతో పెద్దవాగుపై వంతెన గండం ఎప్పుడు దాటుతుందనే సందేహం ప్రజల్లో కల్గుతోంది.

వంతెన నిర్మాణం పూర్తి చేయాలి

పెద్దవాగు వంతెనతో ముడిపడి ఉన్న నల్లమల గ్రామాల్లో ఎక్కువగా గిరిజనులు నివాసం ఉంటున్నారు. ఆయా గ్రామాలకు వారధిగా ఉన్న పెద్దవాగుపై వంతెన నిర్మాణం చేపట్టకపోవడం వెనుక ప్రధాన కారణం పాలకుల వివక్షత స్పష్టంగా కనుబడుతోంది. ఎన్నో ఏండ్ల నుంచి పెద్దవాగుపై వంతెన నిర్మాణం డిమాండ్ స్థాయిలో ఉంది. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి పెద్దవాగుపై వంతెన నిర్మాణం తెరపైకి వస్తోంది. ఎన్నికలు పూర్తిగానే వంతెన నిర్మాణం డిమాండ్ జలమయం అవుతోంది. ఇప్పటికైన పెద్దవాగుపై వంతెన నిర్మాణం పూర్తి చేయకుంటే గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతాం.

- ఆశోక్, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు

ఫౌండేషన్ పనులు జరుగుతున్నాయి

పెద్దవాగుపై వంతెన నిర్మాణం కోసం ఫౌండేషన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వర్షకాలం కావడంతో పనుల్లో జాప్యం కనుబడుతోంది. వేగవతంగా పనులు జరిగేందుకు ఉన్నతాధికారులు కూడా పర్యవేక్షణ చేస్తున్నారు. మొదటి గుత్తేదారుడు తప్పుకోవడంతో ఎస్‌డీఎఫ్ నిధులతో మళ్లీ టెండర్ వేయడం జరిగింది.

- సాయిరాం, పంచాయతీరాజ్, ఏఈ

బడిబాటలో విద్యార్థులు చేరిక

తిమ్మాజిపేట, జూన్ 11 : మండలంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కొనసాగుతుంది. మంగళవారం మండలంలోని వివిధ గ్రామాల్లో మొత్తం 22 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరినట్లు ఎంఈవో శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలో ఉన్న మౌళిక వసతులు విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి సర్కారుబడిలో తమ పిల్లలను చేర్పించాలని కోరారు.

గృహజ్యోతి పథకాన్ని పక్కాగా అమలు చేయాలి

చారకొండ, జూన్ 11 : ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకాన్ని సక్రమంగా అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు సత్యంయాదవ్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ గ్రామాల్లో పూర్తి స్థాయిలో అమలుకావడం లేదన్నారు. గృహలక్ష్మి పథకంపై విద్యుత్‌శాఖ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని చెప్పారు. అర్హులందరికీ గృహలక్ష్మి పథకం వర్తించే విధంగా అధికారులు శ్రద్ధ తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

నేటినుంచి బడులు ప్రారంభం

కల్వకుర్తి రూరల్, జూన్ 11 : వేసవిసెలవుల అనంతరం బుధవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. దాదాపు 60 రోజుల అనంతరం పాఠశాలలు తెరుచుకోనున్నాయి. పాఠశాలలు పునఃప్రారంభం అవుతుండడంతో పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు. గ్రామాల్లో ఇంటింటికీ పాఠశాలల ఉపాధ్యాయులు తిరిగి విద్యార్థుల నమోదుశాతాన్ని పెంచాలని ఎంఈవో బాసూనాయక్ కోరారు.

నేడు కొండనాగులకు ఎమ్మెల్యే రాక

బల్మూరు, జూన్ 11 : మండలంలోని కొండనాగుల ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం నిర్వహించనున్న బడిబాటలో ఎమ్మెల్యే వంశీకృష్ణ పాల్గొననున్నట్లు ఎంపీపీ అరుణ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేస్తారని తెలిపారు.

తుమ్మెన్‌పేటలో భగవద్గీత ప్రచారం

బల్మూరు, జూన్ 11 : మండలంలోని తుమ్మెన్‌పేటలో మంగళవారం త్రైత సిద్ధాంత భగవద్గీతను నాగర్‌కర్నూల్‌శాఖ వారు ప్రచారం చేశారు. సిద్ధాంత గ్రంథాలను గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో సభ్యులు సాయిశంకర్, మనోహర్, రాధాకృష్ణ, ఆంజనేయులు, నిరంజన్, వెంకటయ్య, వరుణ్, రమాదేవి, హంసిని, మంజుల తదితరులున్నారు.

బీసీ కులగణన చేయాలి

అచ్చంపేట టౌన్, జూన్ 11 : బీసీకుల గణన చేసిన తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని బీఎల్ఎఫ్ రాష్ట్ర నాయకుడు ఎంఎం గౌడ్ అన్నారు. మంగళవారం ఆర్డీవో మాధవికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో బ హుజన లెఫ్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం పాల్గొన్నారు.

పీజీ కోర్సులకు నోటిఫికేషన్

కొల్లాపూర్, జూన్ 11 : పాలమూరు విశ్వవిద్యాలయం అనుబంధ కొల్లాపూర్ పీజీ సెంటర్‌లో పీజీ కోర్సులకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు పీజీ సెంటర్ ప్రిన్సిపాల్ డాక్టర్ మార్క్ పోలోనియస్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎంఏ తెలుగు, ఇంగ్లిష్, ఎంకామ్, ఎమ్మెస్సీ మాథ్స్, కోర్సులకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ 17వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు.

నేడు అచ్చంపేటలో అవిశ్వాస తీర్మానం

- బలనిరూపణకు బీఆర్ఎస్, కాంగ్రెస్ కౌన్సిలర్లు

అచ్చంపేట మున్సిపల్ కార్యాలయం

అచ్చంపేట రూరల్, జూన్ 11: అచ్చంపేట మున్సిపాలిటీలో బుధవారం అవిశ్వాస తీర్మానం జరుగనున్నది. ప్రస్తుతం బీఆర్ఎస్‌కు చెందిన నర్సింహాగౌడ్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. గత నెల 25న చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్‌కు 13 మంది కౌన్సిలర్లు వినతిపత్రం అందజేశారు. 2015లో బీఆర్ఎస్ 20 కౌన్సిలర్ స్థానాలను క్లీన్ స్వీప్ చేసి మొదటిసారిగా అచ్చంపేట మున్సిపాలిటీపై బీఆర్ఎస్ జెండాను ఎగురవేసింది. 2019లో రెండోసారి జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 12మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు గెలిచి నర్సింహాగౌడ్‌ను చైర్మన్‌గా ఎన్నుకోగా ప్రస్తుతం ఆయనే కొనసాగుతున్నారు. గత ఎమ్మెల్యే ఎన్నికల ముందు వైస్ చైర్మన్ శైలజారెడ్డి, ఆకుల లావణ్య కాంగ్రెస్‌లో చేరడంతో బీఆర్ఎస్‌కు 10, కాంగ్రెస్‌కు 9 మంది కౌన్సిలర్ల సంఖ్యా బలం ఉన్నది. కాంగ్రెస్ నుంచి చెర్మన్‌గా ఆసక్తి చూపుతున్న ఓ కౌన్సిలర్ పార్టీ మారే కౌన్సిలర్లకు పెద్ద ఎత్తున (రూ.5లక్షల నుంచి రూ.25లక్షల వరకు) ఆఫర్ ఇస్తున్నారని పట్టణంలో టాక్ నడుస్తున్నది.

సర్వం సిద్ధం : మున్సిపల్ కమిషనర్

నేడు జరిగే అవిశ్వాస తీర్మానానికి అంతా సిద్ధం చేశాం. 20మంది కౌన్సిలర్లు, ఎమ్మెల్యేతో కలిపి 21మంది ఓటింగ్‌కు హాజరుకానున్నారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం మొత్తం ఏర్పాట్లు చేశాం. అవిశ్వాస ప్రక్రియ పూర్తయ్యే వరకు వేచి చూడాల్సిందే.

సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి

ధృవపత్రాలను వెరిఫికేషన్ చేస్తున్న డీఈవో గోవిందరాజులు

- జిల్లా విద్యాశాఖాధికారి గోవిందరాజులు

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 11 : జిల్లాలో పని చేస్తున్న భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల పదోన్నతుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయిందని డీఈవో గోవిందరాజులు తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో పీఈటీలు, పండితుల విద్యార్హత ధృవపత్రాల వెరిఫికేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న 154 తెలుగు, 129 హిందీ పండితులు, 62మంది వ్యాయామ ఉపాధ్యాయులు, ముగ్గురు ఉర్దూ ఉపాధ్యాయులు తమ స్కూల్ అసిస్టెంట్ పదోన్నతికి సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నోడల్ అధికారి కుర్మయ్య, రాజశేఖర్‌రావు, సెక్టోరియల్ అధికారులు వెంకటయ్య, షర్ఫొద్దీన్, నూరొద్దీన్, ఎన్జీఎఫ్ కార్యదర్శి పాండు, జీహెచ్ఎం తిరుపతయ్య, రాష్ట్రీయ పండిత్ పరిషత్ ఉపాధ్యాయ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

ఎస్జీటీలు వెరిఫికేషన్ చేయించుకోవాలి

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 11 : జిల్లాలో పని చేస్తున్న ఎస్జీటీ ఉపాధ్యాయులు స్పెషల్ ఎడ్యుకేషన్ బీఈడీ అర్హత కలిగి ఉన్న ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్ స్పెషలైజేషన్ పదోన్నతికోసం సర్వీస్ రిజిస్టర్ ఒరిజినల్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం ఈ నెల 12వ తేదీన డీఈవో కార్యాలయంలో సంప్రదించాలని డీఈవో గోవిందరాజులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా ఎస్జీటీ ఉపాధ్యాయుల నుంచి స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులుగా పదోన్నతి పొందుటకోసం కావాల్సిన ఉపాధ్యాయులు సీనియార్టీ డీఈవో నాగర్‌కర్నూల్ వెబ్‌సైట్ https://deonagarkurnool.weebly.com/లో ఉంచబడిందని ఆయన తెలిపారు.

మిషన్ భగీరథ సర్వే పకడ్బందీగా చేయాలి

- డీఎల్‌పీవో శ్యాంసుందర్

చారకొండలో సర్వేను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో శ్యాంసుందర్

చారకొండ, జూన్ 11 : గ్రామాల్లో మిషన్ భగీరథ పథకంపై నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలని డీఎల్‌పీవో శ్యాంసుందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మిషన్ భగీరథ సర్వే, పంచాయతీ రికార్డులు, నర్సరీలను ఆయన ఎంపీడీవో ఇసాక్‌హుస్సేన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో భగీరథ ద్వారా తాగునీటి సక్రమంగా అందుతుందా లేదా.. తాగునీటి సమస్యలుంటే ప్రజలు సర్వేలో నమోదు చేయించాలన్నారు. మండలంలో 17 గ్రామం పంచాయతీల్లో చేపట్టిన ఇంటింటి సర్వేలో పూర్తిస్థాయి లో వివరాలు సేకరించాలని చెప్పారు. ప్రతిఇంటికీ భగీరథ నీరు అందించే ఉద్దేశంతోనే ప్రభుత్వం సర్వే చేపడుతున్నదన్నారు. ఆయనవెంట ఎంపీవో వెంకటేశ్, పంచాయతీ కారదర్శి గణేశ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు లేకుండా చూడాలి

కల్వకుర్తి రూరల్, జూన్ 11 : గ్రామాల్లో సమస్యలు లేకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వెంకట్రాములు అన్నారు. మంగళవారం సందర్శించారు. అనంతరం పంచాయతీలో రికార్డులను పరిశీలించారు. వర్షాకాలం దృష్ట్యా చెత్తను నిత్యం తరలించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం మిషన్ భగీరథ సర్వే ఆన్‌లైన్ నమోదును ఆయన పర్యవేక్షించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి రమేశ్ ఉన్నారు.

సకాలంలో సర్వే పూర్తి చేయాలి

లింగాల, జూన్ 11 : మిషన్ భగీరథ పథకం ద్వారా గ్రామాల్లో ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఆంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని లింగాల, అప్పాయిపల్లి, శ్రీరంగాపూర్, ఎంసీతండా గ్రామాల్లో డాటా ఎంట్రీ సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో కర్ణా, మిషన్ భగీరథ ఏఈ బాల్‌రాంనాయక్, పంచాయతీ కార్యదర్శి భాగ్యమ్మ, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రులను కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు

కొల్లాపూర్, జూన్ 11: నూతనంగా కేంద్ర మంత్రులుగా బాధ్యతలు చేపట్టిన కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులతో సుధాకర్ రావు మాట్లాడుతూ కొల్లాపూర్ ప్రాంత అభివృద్ధికి పాటుపడాలని విజ్ఞప్తి చేశారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని స